ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025 5 అనంతపురం





వ్యవసాయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు





◆ రెండు వారాల్లో 50 శాతం తగ్గుదల
◆ అరటి రైతుకు మరోసారి క(న)ష్టం..!
◆ గిట్టుబాటు ధరకై రైతుల్లో ఆందోళన

అరటి ధర పతనం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత నెలలోనే జిల్లాలో హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహించి ఉద్యానవన రైతుకు ఊతమిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ప్రకటనలు చేశారు. అదే సమయంలో అరటిని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మంచి ధర రైతుకు దక్కుతున్నట్టు కూడా ఉపన్యాసాలు ఇచ్చారు. సరిగ్గా నెల తిరిగిలోపు అరటి ధరలు నేల చూపులు చూస్తున్నాయి. ఈ 15 రోజుల్లోనే అరటి ధర సగానికిపైగా పడిపోయింది. కొనుగోలు దారులు కోసం రైతులు ఎదురుచూపులు చూసే పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు ఒకటిన్నర లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగయితే అందులో 30 వేల హెక్టార్ల వరకు అరటి పంట ఉంటుంది. ఏడాదికి సుమారు 65 మిలియన్ టన్నుల దిగుబడి అరటి వస్తుంది.

15 రోజుల్లో సగం ధర పతనం

అరటి పంట చేతికొస్తున్న సమయంలో ధరలు అమాంతంగా పడిపోతున్నాయి. 15 రోజుల ముందు వరకు బాక్సు రకం అరటి అంటే ఎగుమతి రకం పంట టన్ను రూ.25 వేల వరకు పలికింది. అటువంటిది ఇప్పుడు రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపు పడిపోయింది. దానికి కూడా కొనేవారు లేకపోవడంతో రైతులు పంటను ఏ రకంగా అమ్ముకోవాలో పాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. వ్యాపారులేమో బయట డిమాండ్ లేదంటూ ధరను అమాంతంగా కిందకు దించేస్తున్నారు. రైతులేమో ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఇప్పుడు ధర తగ్గి నష్టపోయే పరిస్థితులు నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు.

ధర రోజురోజుకు తగ్గిపోతోంది

లక్షలు ఖర్చు పెట్టి మూడు ఎకరాల్లో అరటి పంటను చేశాం. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడం దిగుబడులు బాగా వచ్చాయి. ధర కూడా 15 రోజుల ముందుకు బాగుండటంతో ఈసారి సమస్యల నుంచి గట్టెక్కుతామని ఆశించాం. తీరా కోత దశకు వచ్చేసరికి చూస్తే ధర అమాంతంగా తగ్గిపోయింది. రూ.12 వేలకు టన్ను కూడా అడిగేవారు లేరు.

కేశవ, అరటి రైతు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటనలు చేస్తోంది. ఇటీవలే జిల్లాలో పెద్దఎత్తున ఉద్యావన సదస్సును అధికారులు నిర్వహించారు. అందులోనూ రైతుకు గిట్టుబాటు అందిస్తామని అందరూ చెప్పారు. ఆచరణలో అమలు జరగడంలేదు. ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి పంటలు సాగు చేస్తే రైతుకు గిట్టుబాటు ధర మాత్రం లభించడం లేదు. ప్రభుత్వం అరటి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

శివారెడ్డి,
ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

నాసిరకం విత్తనాలు విక్రయించిన

శ్రావణి సీడ్స్ లైసెన్స్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నాసిరకం కలింగర విత్తనాలు విక్రయించి రైతుకు లక్షాలది రూపాయల నష్టం చేకూర్చిని అనంతపురం శ్రావణి సీడ్స్ లైసెన్స్‌ను రద్దు చేయాలని, నష్టపోయిన రైతు మురళి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. నాసిరకం విత్తనాలతో పంట నష్టపోవడంతో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం, డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళి అనంతపురంలో మంగళవారం నాడు ఆత్మహత్యకు యత్నించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత రైతును రైతుసంఘం నాయకులు కలిసి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం రైతును ఆదుకోవాలని కోరుతూ వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం, డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళి అనంతపురం నగరంలోని శ్రావణి సీడ్స్ దుకాణంలో బిఎస్‌ఎఫ్ మ్యాక్స్ కంపెనీ కలింగర విత్తనాలు తీసుకుని పంట సాగు చేశాడన్నారు. పంట కాలానికి కాయ రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతు శ్రావణి సీడ్స్‌షాపు యజమానులను కలిసి ఇచ్చిన కలింగర విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని, రూ.6.90 లక్షల పెట్టుబడి పెట్టి నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. ఈ సమయంలో సీడ్స్ యాజమాన్యం అవమానరకంగా మాట్లాడటంతో న్యాయం జరగలేదని భావించిన రైతు షాపు ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాని తెలిపారు. అధికారులు స్పందించి నాసిరకం విత్తనాలు విక్రయించిన శ్రావణి సీడ్స్ దుకాణం లైసెన్స్ రద్దు చేయాలన్నారు. నష్టపోయిన రైతు మురళికి నష్టపరిహారం అందించి, రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

హోలీని శాంతియుతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో శుక్రవారం హోలీ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కళ్యాణదుర్గం రూరల్ సిఐ నీలకంఠ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. హోలీ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అరాచకాలు సృష్టించకుండా మత సామరస్యం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు చేసుకోవాలన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించొద్దన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దన్నారు. కీలక ప్రదేశాలు, కాలనీలు, రహదారులల్లో సీసీ కెమెరాల నిఘా ఉందని, డ్రోన్లు కూడా వినియోగిస్తామన్నారు. ఎవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి మౌనిక

మామాడితోట పరిశీలన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మామిడిపండ్ల ఉత్పత్తిలో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు, రక్షణ కవచంలా ఉపయోగ పడే ఫ్రూట్ కవర్‌ను ఉపయోగించాలని ఉద్యానశాఖ అధికారిణి మౌనిక సూచించారు. ఆమె గురు వారం గుమ్మఘట్ట మండలంలోని 75-వీరాపురంలో మామిడి తోటలను పరిశీలించారు. ఫ్రూట్‌కవర్ అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన బారిన పడకుండా ఉపకరిస్తుందన్నారు. తేనెమంచి పురుగు, తామర పురుగు వంటి వాటి నుంచి మామిడి పిందెలకు రక్షణ లభిస్తుందన్నారు. కాయకు ఉండే సహజ మంచి లక్షణాలను పెంచి తొడిమ దృఢంగా తయారై కాయ పరిమాణాన్ని పెంచుతూ దాని సహజరంగును కూడా పెంచుతుందన్నారు. ఒక హెక్టార్ వరకూ పరిమితితో రూ. 2 ప్రకారం కవర్‌ను రాయితీపై అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామర్స్ విద్యార్థులకు క్విజ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ జయరామిరెడ్డి అధ్యక్షతన కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బీకాం విద్యార్థులకు బేసిక్ అర్థమెటిక్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరీక్షల్లో బేసిక్ అర్థమెటిక్ ప్రాధాన్యత, దానిని ఏ విధంగా అభ్యసించాలో వివరించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం బీకాం విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జి.అశోక్, జి.సుదర్శన్, జి.యోగేశ్వర్‌లకు ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎ. రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, గురుమోహన్, జెకెసి మెంటార్ అనిల్, ఎన్‌సిపి డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని సంక్షేమ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువా రం స్థానిక వసతి గృహంలో సాయంకాలం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతు లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మసముద్రంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ స్టడీ హవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. హాస్టల్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థులు ప్రత్యేక వసతులు, స్టడీ హవర్స్, ట్యూటర్స్‌ను వినియోగించుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలిన జనసైనికులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో శుక్రవారం జరగనున్న 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం రాయదుర్గం నుంచి జన సైనికులు బయల్దేరి వెళ్లారు. కురుబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కరేగౌడ మంజునాథ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పవన్‌కళ్యాణ్ సారథ్యంలో 11 ఏళ్ల క్రితం జనసేన పార్టీ ఆవిర్భవించిందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందన్నారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి, సంప్రదా యాలను తెలిపేలా కార్యక్రమాలు రూపొందించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జనసేన ప్రధాన భాగ్యస్వామిగా సమర్థవంతంగా పని చేస్తుందని కొనియాడారు. అనంతరం ఒక బస్సు, నాలుగు వెహికల్స్‌లో వందమందికి పైగా జన సైనికులు బయల్దేరి వెళ్లారు.



కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో బయల్దేరిన జనసేన సైనికులు

'ఉపాధి' బకాయిల చెల్లింపులో జాప్యం తగదు

◆ టిడ్కో, జగనన్న ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి
◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ బిల్లులు తక్షణమే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేక కూలీలు వలసలు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని తెలిపారు. జిల్లాలో 7 మండలాల్లో మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడంతో ఉపాధి కూలీలకు 50 రోజులు అదనపు పని ఆ మండలాల్లోనే చేయిస్తున్నారని తెలిపారు. మేట్లు పనులకు పోటీపడుతున్న అధికారి పార్టీ నాయకులు కూలీలకు డబ్బులు ఇప్పించడంలో శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని 15 నుంచి 21 వరకు గ్రామాల్లో పర్యటించి సచివాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాలని సిపిఎం నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన టిడ్కో, జగనన్న ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జిల్లాలోని సోలార్ ప్రాంతాల బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. హంద్రీనీవా కాలువ వెడల్పు కోసం రైతులు చేసే ఆందోళనకు సిపిఎం సంఘీభావాన్ని ప్రకటించారు. మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి వాడవాడలా జరిపి స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, వి.సావిత్రి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.రామిరెడ్డి, ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, టి.రామాంజినేయులు, కె.భాస్కర్, ఎస్.ముత్తుజా, వై.వెంకటనారాయణ, జి.జగన్‌మోహన్‌రెడ్డి, అచ్యుత్ పాల్గొన్నారు.

198 జీవోను రద్దు చేయాలి

సిఎంకు ఎపి పట్టణ పౌర సంఘాల నేతలు లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ముఖ్యమంత్రికి పంపుతున్న లేఖను చూపుతున్న ఎపి పట్టణ పౌరసంఘాల నాయకులు

రాష్ట్రంలో ఆస్తి విలువ ఆధారంగా పన్ను వసూలు చేయడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 198 జీవోను రద్దు చేసి, అద్దె విలువ ఆధారంగా పాత పద్ధతిలో పన్నులు వసూలు చేసేలా 44-2020 చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జెవివి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.అబ్దుల్ రసూల్, ఏజి.రాజమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎన్‌టి.రాజు హాజరై ముఖ్యమంత్రికి పంపుతున్న లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం ఆస్తి పన్ను పెంపుదలకు మున్సిపల్ సవరణ చట్టం 44-2020 సవరించి ఆస్తి విలువ ఆధారంగా పన్ను వసూలు చేసేందుకు యత్నించిందన్నారు. అప్పుడు పౌర సంఘాలుగా అనేక నిరసనలు, ఆందోళనలు, చేపట్టామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టులో పిటిషన్‌లు కూడా వేసినట్లు గుర్తు చేశారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు కూడా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆస్తి పన్ను చట్టంపై సమీక్షించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అప్పటి ప్రభుత్వానికి 0.25 శాతం అదనపు నిధులు విడుదల చేయాలంటే ఆస్తి ఆధారిత పన్ను విధానం అమలు చేయాలని నిబంధనలు పెట్టడంతోనే అమలుకు చట్టం సవరించారని గుర్తు చేశారు. ప్రజలకు భారంగా ఉన్న ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేయాలన్నారు. పాత పద్ధతిలోనే అద్దె ఆధారిత పన్నులు విధించేలా చట్టాన్ని సవరించాలన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ ద్వారా పంపుతున్నట్లు తెలియజేశారు.



సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

విత్తన దుకాణాలు తనిఖీ

రూ.46లక్షల విలువజేసే సీడ్స్ సీజ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వ్యవసాయశాఖ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, మండల వ్యవసాయ అధికారిని జె.శశికళ గురువారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని బిఎఎస్‌ఎఫ్ కంపెనీకి సంబంధించిన కళింగర విత్తనాలను అమ్ముతున్న శ్రీ భవానీ ఏజెన్సీస్, శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్, శ్రీ రేవతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, అవని సీడ్స్ అండ్ పెస్టిసీడ్స్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మీనల రవి మాట్లాడుతూ బుధవారం నాడు సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన మురళి అనే రైతు నాశిరకం కళింగర విత్తనాలను శ్రావణి సీడ్స్ దుకాణంలో కొనుగోలు చేసి నష్టపోయానని ఆరోపిస్తూ ఆత్మహత్యకు యత్నించాడన్నారు. అందులో భాగంగా శ్రావణి సీడ్స్ దుకాణంలో తనిఖీ నిర్వహించి రూ. 26 లక్షల విలువ గల విత్తన అమ్మకాలను నిలుపదల చేశామన్నారు. సీడ్ యాక్ట్ ప్రకారం బత్తలపల్లి ఉద్యానశాఖ అధికారి సిఫార్సుల మేరకు విత్తనాలను శాంపిల్ తీసి, ఫలితాల్లో నాసిరకం అని తేలితే శ్రావణి ఎంటర్ ప్రైజస్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీ భవాని ఏజెన్సీస్, శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్, శ్రీ రేవతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, అవని సీడ్స్ అండ్ పెస్టిసీడ్స్ షాపుల్లోనూ రూ.20 లక్షల విలువజేసే కళింగర విత్తనాలు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి వెండిపల్లకి వితరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు, వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప వెండి పల్లకిని బహూకరించారు. కుటుంబ సభ్యులతో పాటు ఆలయానికి వచ్చిన కిష్టప్ప ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ, కోశాధికారి లక్ష్మన్నకు సాయిబాబా కోసం రూపొందించిన వెండి పల్లకిని అందజేశారు.

శాంతి కమిటీ సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐ జయనాయక్ ముస్లిం మత పెద్దలు, హిందూ మత పెద్దలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ శుక్రవారం హోలీ, రంజాన్ పండుగలను పట్టణ ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. హోలీ వేడుకలు, రంజాన్ ప్రార్థనలను పరస్పర గౌరవంతో నిర్వహించుకోవాలన్నారు. రాత్రి వేళ పిల్లలు రోడ్లపై తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. వాహనాలు అతివేగంగా నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

చేనేత కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

పెద్దపప్పూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు గురువారం మండల కేంద్రంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.


15న ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తారని గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించే 'ప్రజాదర్బార్'లో ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టణంలో సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం



సమస్యలు తెలుపుతున్న టిడిపి నాయకులు

వేసవికాలం ప్రారంభమైన దృష్ట్యా పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయన పార్టీ ప్రతినిధులు శ్రీనివాసులు, తిప్పేస్వామి, సత్యనారాయణ, ప్రహ్లాద, గోవిందు, శీన, తదితరులతో కలిసి వెళ్లి వివిధ సమస్యలపై కమిషనర్‌తో మాట్లాడారు. పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని సరి చేయాలని కోరారు. 15వ వార్డులో ఎలుగుబంటి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందని తెలిపారు. జెఆర్‌ఎస్ కాలనీలో సిసి రోడ్లు, కోతిగుట్టలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద, చౌక దుకాణం వద్ద పైపులైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేయాలని కోరారు.



పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

'శ్రీచైతన్య'లో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎజిఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం 'ఫ్యామిలీ ఫెస్ట్'ను ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరై తమ పిల్లలను ఆశీర్వదించారు. ప్రిన్సిపల్ ఫిలిప్‌కుమార్ తల్లిదండ్రుల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి లీలావతి, హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని కురువల్లి గ్రామం నుంచి హరేసముద్రం మీదుగా కల్లుదేవనహళ్లి వెళ్లే రహదారి పనులు కొన్నేళ్లుగా ఆగిపోయాయి. ఈ రహదారి కోసం గతంలో ప్రధానమంత్రి నిధుల నుంచి రూ. 2 కోట్లు మంజూరైనా మరమ్మతులకు నోచుకోలేదు. అయితే తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ ప్రత్యేక చొరవ తీసుకుని రైతులతో మాట్లాడి ఈ రహదారిని 60 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసేలా ఒప్పించారు. రైతుల అంగీకారంతో రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కొలతలు వేశారు. ఈ రహదారి పూర్తయితే కందేపల్లి, కల్లుదేవనహళ్లి మీదుగా ఉరవకొండకు వెళ్లడానికి సుమారు 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్, పోలీసులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాలలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వేసవి కాలంలో మజ్జిగ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు ఎముకలకు క్యాల్షియం అందుతుందని అధ్యాపకులు గోవర్ధన్ తెలిపారు. పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సూక్ష్మజీవ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కిన్వన ప్రక్రియ ద్వారా తయారైన మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న విజయవాడలో నిరసన దీక్షలు : ఎస్‌ఎఫ్‌ఐ


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఈనెల 15న విజయవాడలో చేపట్టనున్న దీక్షలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఉరవకొండ మండల అధ్యక్షులు నందు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం పట్టణంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వంలో గతంలో చలో విజయవాడ నిర్వహించే క్రమంలో ప్రభుత్వం చర్చలకు పిలిచి నెలరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే మూడు నెలలు కావస్తున్నా పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. కావున వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షల్లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు తరుణ్, ఎర్రిస్వామి, భాస్కర్, వంశీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'అమరావతి మెగా మార్ట్'కు విశేష ఆదరణ


దుస్తుల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న అమరావతి మెగామార్ట్

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక లలిత కళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన అమరావతి మెగా మార్టుకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నట్లు సంస్థ ప్రొప్రైటర్ గోపీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అనంతపురం ప్రజల కు ఉగాది, దసరా పండుగ నేపథ్యంలో అతి తక్కువ ధరలో నాణ్యమైన దుస్తులను అందిస్తున్నట్లు చెప్పా రు. పిల్లలు పెద్దలు అందరికీ నచ్చేలా నచ్చేలా వివిధ ప్రాంతాలకు చెందిన రకరకాల మోడల్స్ ప్రజలకు అతి తక్కువ ధరల్లో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉగాది, రంజాన్ పురస్కరించుకుని వేలాది మోడల్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు సంబంధించిన అద్భుతమైన మోడల్స్, దేశం నలుమూలల్లో లభించే వివిధ రకాల మోడల్స్ ఉన్నాయన్నారు. మహిళలకు సంబంధించిన వివిధ రకాల చీరలు, యువతకు సంబంధించిన గాగ్రాలు చుడిదార్లు వంటి అనేక రకమైన మోడల్స్ ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని అనంతపురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనంతపురం

'భవిష్యత్ భద్రత కోసం సైబర్ సెక్యూరిటీ వ్యూహాలు-సంఘటనల ప్రతిస్పందన' అనే సైబర్ సెక్యూరిటీ అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రిన్సిపల్ సెక్యూరిటీ, సిటిఇఎం ఆర్కిటెక్ట్ విష్ణువర్ధన్ చంద్రుపట్ల మాట్లాడుతూ సైబర్‌సెక్యూరిటీ అనేది కేవలం ఐటి రంగం మాత్రమే కాకుండా ప్రతిరంగంలో కీలక అంశంగా మారిందన్నారు. సైబర్ టెర్రరిజం, డేటా దోపిడీ, మల్వేర్ దాడుల వంటి సైబర్-రిస్క్స్ పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ వ్యూహాలు కేవలం టెక్నికల్ పరిష్కారాలు మాత్రమే కాకుండా, సంస్థలపై సైబర్ దాడుల ప్రభావం తగ్గించడానికి తగిన జాగ్రత్తలు, ఉత్తమ సాధనాలను అమలు చేయడం అనివార్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, కార్పొరేట్ ట్రైనర్ వహీదా పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మక్కు రాజకీయాలు మానుకో..

'వైకుంఠం'పై టిడిపి మైనార్టీ నాయకుల ఆగ్రహం


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఇప్పటికైనా కుమ్మక్కు రాజకీయాలు మానుకోవాలని టిడిపి మైనార్టీ నాయకులు హితవు పలికారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జెఎం బాషా మాట్లాడుతూ మైనార్టీ దినోత్సవం సందర్భంగా నగరంలో అబుల్‌కలాం విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి తీసుకెళ్లినప్పుడు కొత్త విగ్రహం తెప్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. అంత సమయం లేనందున రోడ్డు విస్తరణలో తొలగించిన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి 11 రోజుల్లోనే విగ్రహాన్ని పున:ప్రతిష్టించారని తెలిపారు. కానీ వైసీపీతో కుమ్మక్కై రాజకీయం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పైగా దీనిపై కోర్టుకు కూడా వెళ్తామని చెప్పడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభాకర్‌చౌదరి శిలాఫలకాలపై చేస్తున్న కుమ్మక్కు రాజకీయాలు మానుకోవాలన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ మెడికల్ లేబరేటరీ టెక్నీషియన్స్ డే సందర్భంగా జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో గురువారం ల్యాబ్ టెక్నిషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ గిరిజ మనోహర్, డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎస్.వేణుగోపాల్, ఉపాధ్యక్షులు రవీంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌బాబు, శివకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, కరుణ, రవికిరణ్, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

అనంతపురం సిటీ : ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా కమలానగర్‌లోని వృద్ధాశ్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విల్సన్, చంద్ర, ధీరజ్, రామమోహన్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, మనోజ్, మనోహర్, రామాంజి, భరత్, రాజేంద్ర, వేణు, తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' అట్టర్ ఫ్లాప్

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల వైసిపి హయాంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమం పూర్తిగా విఫలమైందని వాల్మీకి ఫెడరేషన్, కార్పొరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి అన్నారు. గురువారం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో విద్యార్థులకు తీరని అన్యాయం చేసి ఇప్పుడు యువత పోరు యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 నుంచి 2024 మధ్య విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యాజీవనగా పేరు మార్చారన్నారు. కానీ ఏమాత్రం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ఐదేళ్ల పాలనలో విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

ఇఫ్తార్ విందు

అనంతపురం : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 40వ డివిజన్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు నలుబోలు మధురాయల్ ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఇందులో భాగంగా 40 డివిజన్ ఆజాద్‌నగర్ హసేన్ మసీదులో ఉపవాస దీక్షలు విరమించిన ముస్లిములకు విందు ఇచ్చారు.

15 నుంచి కూలీల వద్దకు స్కూటర్ యాత్ర

ఎపి వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి


మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15 నుంచి 20వతేదీ వరకూ చేపడుతున్న ఉపాధి హామీ పనులు చేసే కూలీల వద్దకు స్కూటర్ యాత్ర చేపట్టనున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం గణేనాయక్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో కనీసం 4 నుంచి 10 గ్రామాల వరకూ స్కూటర్ యాత్ర పనులు దగ్గరకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలను ఈనెల 20 నుంచి 24వతేదీ వరకూ గ్రామ సచివాలయాల్లో అర్జీలు ఇచ్చి ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. అప్పటికీ పరిష్కరించకపోతే ఏప్రిల్ మొదటి వారంలో డ్వామా పీడీ, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, ఉపాధ్యక్షులు భాస్కర్, కృష్ణ, నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పెద్దయ్య, తేరి, నాగప్ప, నాగలింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెడ్.వీరారెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

కలెక్టర్ వినోద్‌కుమార్


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి నిర్మల

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులో ఉన్న జెడ్ వీరారెడ్డి కాలనీలో కనీస మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం స్థానిక జెడ్ వీరారెడ్డి కాలనీని కలెక్టర్ సందర్శించి తాగునీటి ట్యాంకుతోపాటు సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, కాలనీవాసులు జెడ్.వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 68 మందికి కాలనీలో ఇంటి పట్టాలు ఇవ్వాలని గుత్తి నుంచి అనంతపురం కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి అర్జీలు ఇచ్చామని గుర్తు చేశారు. కాలనీకు ప్రధాన రహదారి లేదన్నారు. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో చిన్నారుల అధికంగా ఉన్నారని వారి కోసం అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, శ్రీ సత్యసాయి మంచినీటి ప్రాజెక్టు నుంచి తాగునీరు సరఫరా చేయాలని విన్నవించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ జెడ్ వీరారెడ్డి కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తామన్నారు. కాలనీలో ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్ డి.ఓబిలేసును ఆదేశించారు. కాలనీకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, డిఇ హేమచంద్రకు ఆదేశాలు జారీ చేశారు. సామాజిక పింఛన్ల సమస్య పరిష్కరించాలని డిఎల్ పిఓ విజయలక్ష్మికి సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి బసినేపల్లి గ్రామానికి వెళ్లారు. ఆయన ఎంపిడిఒ డి.ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలకు పునరావాసం కల్పించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, శ్రావణిశ్రీ

మంత్రులు డోలా, నిమ్మలకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ కింద పునరావాసం కల్పించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని ఎస్‌సి వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని, ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, బుక్కరాయసముద్రంలో అంబేద్కర్ భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని మిడ్‌పెన్నార్ హెచ్ఎల్‌సి కెనాల్ ఆధునీకరణ, చాగల్లు రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించాలని, గండికోట రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు విడుదల చేయాలని కోరారు. ఇందుకు ఆయా మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని వినతి

శింగనమల మండలంలోని అలంకరాయునిపేట గ్రామం వద్ద కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని సిఎం చంద్రబాబుతోపాటు మంత్రి నిమ్మల రామానాయుడుకు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో కూతలేరు వంక పొంగిన సమయంలో అలంకరాయుని పేట గ్రామస్తులు పడే ఇబ్బందులను వివరించారు. ఇందుకు సిఎం, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మీరే ఫీజు బకాయిలు పెట్టి.. నిరసనలు చేస్తారా.?

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధికారంలో ఉన్నప్పుడు లక్షల కోట్లు అప్పులు చేసి.. ఇప్పుడు నిరసల పేరుతో వైసిపి డ్రామాలు ఆడుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన తర్వాత ఉనికి కోసం ఇలాంటి పెయిడ్ నిరసనలు చేస్తున్నారని విమర్శించారు. మీ పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో ఈ ఏడాది ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్లు చెల్లించిందన్నారు. పేరుకుపోయిన బకాయిలను కూటమి ప్రభుత్వంలో విడతల వారీగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని, కానీ చర్చకు రాకుండా కేవలం నినాదాలు చేసి, గందరగోళం సృష్టించారని వైసీపీ ఎమ్మెల్సీలపై విమర్శలు చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని, ఉద్యోగాలు కూడా కల్పిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలు, లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాలికలకు వివాహాలు చేయరాదన్నారు. చిన్న వయస్సులో గర్భం దాల్చం వల్ల అనేక దుష్ప్రరిణామాలు సంభవిస్తాయన్నారు. కావున యుక్త వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయలన్నారు. అలాకాకుండా బాల్య వివాహలు చేస్తే చట్టరిత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ గీతారాణి, హెల్త్ సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఆరోగ్య కార్యకర్త శైలజ, మహిళా పోలీస్ శిల్ప, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాల్యవివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం-2006, టీనేజ్ గర్భం వల్ల కలిగే నష్టాలు, పిసిపి ఎన్‌డిటి-1994 చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ, ఆరోగ్య సహాయకులు నారాయణస్వామి, ఎఎన్ఎం అనిత, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి, ఆశా కార్యకర్త నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు అవుదాం

ఉరవకొండ : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి సమాజసేవలో భాగస్వాములు అవుదామని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి రాజేంద్రస్వామి పిలుపునిచ్చారు. గురువారం జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జై కిసాన్ ఫౌండేషన్ ఛైర్మన్ నాగమల్లి ఓబులేసు, రజిని కుమారుడు నాగమల్లి అక్రాంత్ రుషి, కుమార్తె నాగమల్లి మనస్వి జన్మదినాన్ని పురస్కరించుకుని చల్లని మినరల్ వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి కోఆర్డినేటర్ పుష్పక్క, పట్టణ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, లయన్స్ క్లబ్ జిల్లా సభ్యులు గణేష్‌బాబు, ఎల్ఐసి గోవిందు, సత్యం కన్వెన్షన్ హాల్ లయన్ సత్యం, ఆపద్బంధు ట్రస్టు అధ్యక్షులు మురళి, వార్డు మెంబర్ నిరంజన్‌గౌడ్, టీచర్ శంకర్, జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు చరణ్, విడపనకల్ రైతులు షాజహాన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ అశ్వర్థ నారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం

తాడిపత్రి : పట్టణంలోని పోరాట కాలనీ 1వరోడ్డులో ఉన్న లక్ష్మీ అశ్వర్థనారాయణ స్వామి ఆలయం 1వ వార్షికోత్సవాన్ని అశ్వర్థ నారాయణ కట్ట పునరుద్ధరణ సేవా సమితి సభ్యులు ఆర్.శివయ్య, విశ్వనాథు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతే మార్చి 13న దాతల సహకారంతో లక్ష్మీ అశ్వర్థ నారాయణస్వామి, నాగదేవతల, వినాయక విగ్రహా ప్రతిష్టగావించి నేటికి సంవత్సర కాలం పురస్కరించుకుని మొదటి వార్షికోత్సవం నిర్వహించినట్లు తెలిపారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

రాప్తాడు : గ్రామాల్లో నాటుసారాను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహశీల్దార్ విజయకుమారి, ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నాటు సారాను నిర్మూలించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, అమ్మటం నేరం అన్నారు. ఇందుకు రూ.5 లక్షలు జరిమానా, 8ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. 'నాటు సారా మానేద్దాం-ఆరోగ్యాన్ని కాపాడుదాం' అనే నినాదంతో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కృష్ణానాయక్, నరసింహానాయక్, వీరనారపరెడ్డి, నవీన్‌కుమార్‌పాల్గొన్నారు.

చేప పిల్లలు విడుదల

పుట్లూరు : సీడ్ స్టాకింగ్ కమిటీ ఆధ్వర్యంలో పుట్లూరు గ్రామంలోని ఎల్లోజీ పంతులు చెరువులో 40 శాతం సబ్సిడీతో దాదాపు 29,600 చేప పిల్లలను వదిలారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద చేపల పెంప కానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇదందులో భాగంగా మత్యకారులు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సబ్సిడీపై చేప పిల్లలను విడుదల చేసినట్లు మత్స్యకార అభివృద్ధి అధికారి పకీరప్ప, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎంపిడిఒ అలివేలమ్మ, ఫిషరేషన్ అసిస్టెంట్ వైష్ణవి, సర్పంచు ఓబులేసు, విఆర్ఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

తామర పురుగు నివారణపై అవగాహన

బెలుగుప్ప : మామిడి సాగులో తామర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం కళ్యాణదుర్గం డివిజన్‌లో సాగు చేసిన మామిడి తోటలను ఉద్యాన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ పరిశీలించారు. ఇందులో భాగంగా మామిడి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ముఖ్యంగా మామిడిలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల నిర్వహణ కోసం అధికారులు సూచించిన మందులను పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

గుత్తి : సాంకేతిక పరిజ్ఞానంలో కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన 'మై జర్నీ' ఇన్స్పిరేషనల్ టాక్స్ అనే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి భారత్ దేశం మొదటి స్థానంలో నిలిపే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఎక్కువగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన తన జీవితంలోని ఎలా కృషి చేసి ఈస్థాయికి వచ్చారో చెప్పారు. అనంతరం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, పెద్దవడుగూరు తహశీల్దార్ ఉషారాణి, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వికె.శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిల్వలపై దాడులు

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగిల్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ దిగుమతి నిల్వలపై కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్లాస్టిక్ షాపుల యజమానులకు రూ.52,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధానికి సహకరించాలన్నారు. సింగల్ ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి హానికరమన్నారు. కావున ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి సింగల్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి నిషేధం కట్టుదిట్టంగా అమలయ్యే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

యాడికి : మండల పరిధిలోని పిన్నేపల్లిలో వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు తన సొంత ఖర్చులతో గురువారం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. తాగునీటి సమస్యతో కొన్ని రోజులుగా స్థానికులు ఇబ్బందులు పడుతుండటంతో నీరు సరఫరా చేసినట్లు సంజీవరాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అగ్గి రాముడు, సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ జెఎసి సూర్యనారాయణ, వైసిపి నాయకులు మురళి, శ్రీరాములు, శ్రీకాంత్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

శింగనమల : మండలంలోని పెద్దమట్లగొందిలో గ్రామ పెద్దల సమక్షంలో గురువారం ఆంజనేయ స్వామి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదట బుక్కరాయసముద్రం మండలం అమ్మవారిపేట, శింగనమల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శింగనమల జట్టు 10 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అమ్మవారిపేట టీం 7.4ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 68 పరుగులతో ఘనవిజయం సాధించింది.

'సాయి విజ్ఞాన్'లో హోలీ సంబరాలు

అనంతపురం సిటీ : నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయులు లావణ్య రామ్ కలిసి అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగులు జల్లుకుని సంబరాలు చేసుకున్నారు.

పెద్దయక్కలూరులో 104 సేవలు

పెద్దపప్పూరు : మండల పరిధిలోని పెద్దయక్కలూరు గ్రామంలో గురువారం 104 సేవలు అందించారు. ఈ సందర్భంగా పెద్దపప్పూరు మండల వైద్యాధికారి లోకేష్‌కుమార్ వైద్యసేవలు అందించారు. తర్వాత ఎన్‌సిడి సిడి సర్వేను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శర్మష్‌వలి, ఆరోగ్య పర్యవేక్షకులు గంగాదేవి, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రాజశేఖర్ యాదవ్

శింగనమల : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను జిల్లా తెలుగు యువత నాయకులు కాయల రాజశేఖర్‌యాదవ్ గురువారం విజయవాడలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసిన యువతకు అవకాశం కల్పించాలని విన్నవించారు. యువతకు పదవులు ఇస్తే పార్టీలో మరింత చురుగ్గా పని చేస్తారని వివరించారు. ఇందుకు రాష్ట్ర అధ్యక్షులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పాస్టర్ల సర్వసభ్య సమావేశం

అనంతపురం : నగర సమీపంలోని రాచానపల్లిలో ఉన్న యేసు కృప మందిరంలో అధ్యక్షులు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో 57వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి మనషే అధ్యక్షతన పాస్టర్ బాబు ప్రార్థించగా దైవ సేవకులు పాటలు పాడి దేవుని నామాన్ని ఘనపరిచారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పాస్టర్ నవీన్‌కుమార్, ప్రత్యేక అతిథి బెంజిమెన్, పాస్టర్లు మార్టిన్, రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు, పి.మార్కు, జిఆర్ ఆనంద్, వి.మనషే, కె.జీవన్‌బాబు, జహంగీర్ జాషువా, లాబాన్ సుధాకర్, విజయ్ సింహ, చార్లెస్ నాయక్, బిషప్ వాసు, అనిల్ కాంత్, బ్రదర్ ఆనందరెడ్డి, బాబు, గిద్యోన్, పాస్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఫేర్‌వెల్‌డే

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం ఘనంగా ఫేర్‌వెల్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నారు. అనంతరం సరస్వతి పూజలు నిర్వహించి విద్యార్థులకు క్రమశిక్షణ, భవిష్యత్ కార్యాచరణపై పలు విషయాలు పాఠశాల ప్రిన్సిపాల్ తపస్సుమ్ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలి

బెలుగుప్ప : మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, ఎఎల్‌పి కోఆర్డినేటర్ రిజ్వానా పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపు సంఘాల్లో నగదు తీసుకుని చిన్న చిన్న వ్యాపారులు చేసుకుని మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్‌సి కోఆర్డినేటర్ శాలిని, డాక్టర్ ప్రియాంక, సిఇఒ హరీష్, మండల సస్యమిత్ర గ్రూపు సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

టీవీ మెకానిక్ ఆత్మహత్య

నార్పల : మండల కేంద్రంలోని ఒరుగుమోడి స్వామి వీధికి చెందిన రొట్టెల రమేష్ (39) గురువారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నార్పలలో టీవీ మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగించే రమేష్ కొద్దికాలంగా తాగుడు, తదితర దురలవాట్లకు అలవాటు పడ్డాడు. దీంతో కుటుంబ బాధ్యతలు పట్టించుకోకుండా తిరిగేవాడు. అతని ప్రవర్తనతో విసుగు చెందిన తల్లిదండ్రులు, భార్య మందలించారు. దీంతో కలత చెందిన రమేష్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి రొట్టెల కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు గ్రామానికి చెందిన రాధిక గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. పలు ఆసుపత్రులలో చికిత్స తీసుకున్న ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్రమనస్తాపం గురైన ఆమె బుధవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.